నేడు ఓయూలో రౌండ్‌టేబుల్‌ సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్‌ కాలేజీ న్యూ సెమినార్‌ హాలులో మంగళవారం ఉదయం 10.30 గంటలకు శాంతి చర్చలు– మేధో స్పందన అనే అంశం పై రౌండ్‌ టేబుల్‌ సమావేశం జరగనుంది. మధ్య భారత్‌లో ఆదివాసీలపై జరుగుతున్న దాడులను ఆపివేయాలని కేంద్ర ప్రభుత్వం విప్లవకారులతో తక్షణమే శాంతి చర్చలు జరపాలని ఓయూ విద్యార్థి సంఘాలు, పరిశోధక విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ సమావేశం జరుగనుంది.

జూదం ఆడుతున్న 16 మంది అరెస్ట్‌

సనత్‌నగర్‌: గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న 16 మందిని బేగంపేట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు..బేగంపేట ఓల్డ్‌ ఆనంద్‌ థియేటర్‌ లేన్‌లోని పైగా కాలనీ, విమల్‌నగర్‌లోని ఓ ఇంట్లో మూడు ముక్కలాట ఆడుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం బేగంపేట ఎస్‌ఐ శ్రీధర్‌, ఇతర సిబ్బంది ఆకస్మికంగా దాడి చేశారు. రసూల్‌పురాకు చెందిన షేక్‌ యూసుఫ్‌ (36) నిర్వహణలో మూడు ముక్కల జూదం నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిర్వాహకుడితో పాటు నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 16 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1,91,975ల నగదును, ప్లేయింగ్‌ కార్డ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

మద్యం మత్తులో భార్యాభర్తలపై దాడి

సనత్‌నగర్‌: బహిరంగ ప్రదేశంలో మద్యం తాగడమే కాకుండా భార్యాభర్తలు, మరొకరిపై దాడి చేసిన యువకుడిపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. ప్రభుత్వ ఆస్పత్రిలో ఆశా వర్కర్‌గా పనిచేసే విమల, కారు డ్రైవర్‌గా పనిచేసే ఆమె భర్త లకావత్‌ సూర్య రసూల్‌పురాలోని చంద్రబాబునగర్‌లో నివాసం ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన సూర్య తన బైక్‌ను ఇంటి పక్కన పార్కు చేసేందుకు వెళ్లాడు. ఆ సమయంలో అక్కడ కిట్టూ అనే యువకుడు మద్యం తాగుతూ సూర్యతో ఘర్షణ పడ్డాడు. సూర్యను తీవ్రంగా గాయపడడమే కాకుండా అడ్డువచ్చిన అతని బంధువును కూడా తీవ్రంగా కొట్టాడు. ఈ అలికిడితో బయటకు వచ్చిన సూర్య భార్య విమలపై కూడా చేయిచేసుకున్నాడు. దీంతో బాధితులు బేగంపేట పోలీసులను ఆశ్రయించడంతో నిందితుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాచ్‌మన్‌ను తోయడంతో మృతి

బన్సీలాల్‌పేట్‌: ఓ వ్యక్తి తోసేయడంతో తలకు తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వాచ్‌మెన్‌ మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం గాంధీనగర్‌ పోలీసు స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్‌ బోస్‌ కిరణ్‌ తెలిపిన మేరకు.. న్యూబోయిగూడలోని ఎస్‌ఎంఆర్‌ స్వేర్‌ అపార్టుమెంట్‌ వద్ద వాచ్‌మెన్‌ భాస్కర్‌(68) వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. అపార్టుమెంట్‌ ముందు సురేష్‌ అనే వ్యక్తి తప్పతాగి పడుకొన్నాడు. అనేక సార్లు లేపినా లేవకుండా అలాగే పడుకోవడంతో భాస్కర్‌ అతన్ని బలవంతంగా నిద్రలేపాడు. దీంతో కోపోద్రిక్తుడైన సురేష్‌ వాచ్‌మెన్‌ను బలంగా నెట్టాడు. దాంతో కింద పడిన భాస్కర్‌కు తలకు తీవ్ర గాయాలయ్యాయి. వైద్య చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ భాస్కర్‌ మృతి చెందాడు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

సికింద్రాబాద్‌: అనారోగ్యంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్‌ జీఆర్పీ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్‌ డేవిడ్‌ రాజ్‌ తెలిపిన మేరకు.. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరక్‌పూర్‌ జిల్లాకు చెందిన జినక్‌(39) నగరంలో పెయింటర్‌ పని చేస్తూ జీవనం సాగించేవాడు. సోమవారం తన గ్రామానికి వెళ్లేందుకు సికింద్రాబాద్‌ రైల్వే స్టేషన్‌కు వచ్చిన జినక్‌ ప్లాట్‌ఫాం నంబర్‌ 6,7 లో అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందజేయగా, ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతనిని పరిశీలించి మృతి చెందినట్లు గుర్తించారు. అనంతరం, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్‌: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్‌ జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు..బొల్లారం వద్ద సోమవారం ఉదయం 10 గంటల సమయంలో సుమారు 45 నుంచి 50 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు తెలుపు రంగు షర్ట్‌, ఆరెంజ్‌ కలర్‌ ట్రాక్‌ ప్యాంట్‌ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంకుడు గుంతలపై ధ్యాసేదీ?

అధ్వాన్నస్థితిలో ఇంకుడుగుంతలు



జెక్‌కాలనీ రోడ్డునెంబర్‌-4లో ఆకృతి నివాస్‌ సమీపంలో బ్లాక్‌ అయిన ఇంకుడుగుంత



జెక్‌కాలనీ రోడ్డునెంబర్‌-4లో స్టేట్‌ వ్యూ వద్ద ఇంకుడుగుంత పరిస్థితి

సనత్‌నగర్‌: పరిమితికి మించి లోపలికి వెళ్లినా పాతాళ గంగ జాడ కానరాదు..నీటి జాడ లేక బోర్లు కాస్తా బావురుమంటున్నాయి. ఈ క్రమంలో భూగర్భ జలసిరి పెంచేందుకు ఇంకుడుగుంతలే శరణ్యం. అలాంటి ఇంకుడుగుంతల తీరు చూస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే. మరో నెల రోజుల్లో వర్షాకాలం ప్రవేశించనున్న దృష్ట్యా ఇంకుడుగుంతల పునరుద్ధరణపై ధ్యాస మాత్రం అధికారులకు కనిపించడం లేదు. గతంలో జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు పెద్ద సంఖ్యలో ఇంకుడుగుంతల నిర్మాణాలు చేపట్టారు. కార్పొరేట్‌ సోషల్‌ రెస్పాన్సిబులిటీ (సీఎస్‌ఆర్‌) కింద కూడా పలువురు ఇంకుడుగుంతల నిర్మాణానికి ముందుకువచ్చి నిధులు వెచ్చించారు. అయితే వాటి నిర్వహణను మాత్రం గాలికొదిలేశారు. చుక్కనీరు ఇంకేందుకు అవకాశం ఉన్న మార్గాలను ఒకవైపు అన్వేషిస్తుండగా, ఇంకో వైపు ఇప్పటికే అధ్వాన్నస్థితిలో ఉన్న ఇంకుడుగుంతలను పునర్వినియోగంలోకి తీసుకువచ్చే ఆలోచన చేయకపోవడం బాధాకరం. ముఖ్యంగా జెక్‌కాలనీలో ఇంకుడుగుంతల పరిస్థితి మరింత అధ్వాన్నం. ఇక్కడ 1500 ఫీట్లు దాటి వెళ్లినా గంగమ్మ జాడ ఉంటుందో లేదో తెలియని పరిస్థితి. గతంలో వెయ్యి ఫీట్లు లోపు వేసిన బోర్లు ఇప్పటికే మూతపడ్డాయి. కాలనీలో దాదాపు 50 అపార్ట్‌మెంట్లు, రెండు వేల ఫ్లాట్స్‌, 40 వరకు వ్యక్తిగత గృహాలు, ఎనిమిది వేల జనాభా ఉన్న జెక్‌కాలనీలో నీటి ఇంకే పరిస్థితి చాలా తక్కువ. వేసవి కాలం వచ్చిందంటే ఇక్కడి వారికి ప్రైవేటు ట్యాంకర్ల దిక్కు. ఒక్కో అపార్ట్‌మెంట్‌లో కనీసం 40 నుంచి 200 వరకు ఫ్లాట్స్‌ ఉండడంతో జల మండలి సరఫరా చేసే నీరు వారి అవసరాలను తీర్చలేకపోతున్నాయి. దీంతో ఒక్కో అపార్ట్‌మెంట్‌ కనీసం రోజుకు 4 ట్యాంకర్ల నుంచి 8 ట్యాంకర్ల మేర కొనుక్కోవాల్సి వస్తోంది. ఒక్కో అపార్ట్‌మెంట్‌పై నెలకొచ్చేసరికి సరాసరి 3 లక్షల నుంచి 6 లక్షల మేర కేవలం నీటి కొనుగోలుకే వెచ్చించాల్సి రావడం గమనార్హం. అంటే ఒక్కో ఫ్లాట్‌పై రూ. 3,000 నుంచి 6,000 వరకు అదనపు భారం పడుతోంది.

కొత్తవి సరే.. పాత వాటి సంగతేంటి..?

జీహెచ్‌ఎంసీ, జలమండలి సంయుక్తంగా సనత్‌నగర్‌, అమీర్‌పేట డివిజన్లలో అనుకూలమైన ప్రాంతాల్లో దాదాపు 50 వరకు ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టారు. ఇప్పుడు దాదాపు ఏవీ కూడా ఉండాల్సిన పరిస్థితిలో లేకపోవడం గమనార్హం. ఒకవైపు 300 గజాలు పైబడిన విస్తీర్ణంలో తప్పనిసరికిగా ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టాలని అధికారులు అనుమతుల సమయంలోనే మార్గనిర్దేశనం చేస్తున్నా పూర్తిస్థాయిలో అమలవుతున్న దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. కొత్తవాటి గురించి ఆలోచన చేస్తుండడం మంచిదే అయినప్పటికీ పాత వాటి పరిస్థితి ఏమిటా? అని ఆలోచించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నాలా పనులు త్వరగా పూర్తిచేయండి



గాయత్రీనగర్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట: నాలా పనులకు అడ్డంకిగా మారిన విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌లను మరో చోటకు మార్చి పనులు సజావుగా,త్వరగా పూర్తయ్యేలా చూడాలని సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ అధికారులను ఆదేశించారు. అమీర్‌పేట గాయత్రీనగర్‌లో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో బాక్స్‌ డ్రైన్‌ నిర్మాణం కోసం గత ప్రభుత్వం రూ.1.50 కోట్లు మంజూరు చేసింది. బాక్స్‌ డ్రైన్‌ నిర్మాణ పనులు జరిగే చోట ట్రాన్స్‌ ఫార్మర్‌లు ఉన్న కారణంగా పనులు నిలిచి పోయాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమవారం అధికారులతో కలిసి గాయత్రీనగర్‌లో పర్యటించి సమస్యపై చర్చించారు. అలాగే ఓపెన్‌ నాలాలో పూర్తిస్థాయిలో పూడిక తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మాజీ కార్పొరేటర్‌ ఎన్‌.శేషుకుమారి, డీ.సి.రజనీకాంత్‌ పాల్గొన్నారు.

వర్సిటీలలో ఖాళీలను భర్తీ చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ వర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక ఉద్యోగాలను భర్తీ చేయాలని తెలంగాణ డాక్టరేట్స్‌ అసోసియేషన్‌ (టీజీడీఏ) నాయకులు, విద్యాశాఖ కార్యదర్శి యోగిత రాణి, ఉన్నత విద్య మండలి ఛైర్మన్‌ ప్రొ.బాల కృష్ణారెడ్డిలకు సోమవారం వినతి పత్రం సమర్పించారు. అన్ని వర్సిటీలకు కలిపి కేవలం 400 పోస్టులు మాత్రమే భర్తీ చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసిందని టీజీడీఏ నాయకులు చెప్పారు. వర్సిటీలలో 13 ఏండ్లుగా అధ్యాపక ఉద్యోగాలు భర్తీ చేయనందున సుమారు 3000 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. తక్కువ సంఖ్యలో అధ్యాపక ఉద్యోగాల భర్తీకి విడుదల చేసిన జీవో నంబర్‌ 21ని జారీ చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో టీజీడీఏ నాయకులు రమణ రావు, పెద్దిరెడ్డి నరేందర్‌ రెడ్డి, బొల్లం తిరుపతి, రామ్‌ నరసింహా గౌడ్‌ పాల్గొన్నారు.



ప్రొ.బాల కృష్ణారెడ్డికి వినతి పత్రం అందచేస్తున్న టీజీడీఏ నాయకులు

'గాంధీ'లో ఘనంగా ఫోరెన్సిక్‌ మెడిసిన్‌డే



రిటైర్డ్‌ ఫోరెన్సిక్‌ మెడిసిన్‌ ప్రొఫెసర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గాంధీఆస్పత్రి: వైద్యపరిజ్ఞానాన్ని న్యాయచట్టంలో వినియోగించే ఏకైక విభాగం ఫోరెన్సిక్‌ అండ్‌ టాక్సికాలజీ విభాగమని గాంధీ ఫోరెన్సిక్‌ మెడిసిన్‌ హెచ్‌ఓడీ ప్రొఫెసర్‌ కృపాల్‌సింగ్‌ అన్నారు. జాతీయ ఫోరెన్సిక్‌ మెడిసిన్‌ దినోత్సవ వేడుకలు గాంధీ మెడికల్‌ కాలేజీలో సోమవారం ఘనంగా నిర్వహించారు. గాంధీ మెడికల్‌ కాలేజీ ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ ఇందిర, ఆస్పత్రి సూపరింటెండెంట్‌ ప్రొఫెసర్‌ రాజకుమారిలు ముఖ్యఅతిథులుగా హాజరై వేడుకలను ప్రారంభించారు. మరణించిన వారి కుటుంబసభ్యుల తరుపున మాట్లాడే విభాగం ఫోరెన్సిక్‌ మెడిసిన్‌ అన్నారు. పదవీ విరమణ చేసిన ఫోరెన్సిక్‌ మెడిసిన్‌ వైద్యులు రవీందర్‌రెడ్డి, దామోదర్‌లకు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. గాంధీ ఫోరెన్సిక్‌ మెడిసిన్‌ వైద్యులు వసంత్‌నాయక్‌, వెంకట్‌నాగరాజు, సూరజ్‌, లక్ష్మీకాంత్‌రెడ్డి, సందీప్‌, నాగేంద్రబాబు, లావణ్య, ఆర్‌ఎంఓ-1 శేషాద్రి, వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో దేశం సుభిక్షం



కంటోన్మెంట్‌: ప్రధాన మంత్రి మోదీ పాలనలో దేశం సుభిక్షంగా ఉందని కంటోన్మెంట్‌ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జే. రామకృష్ణ అన్నారు. పహల్గామ్‌ ఉగ్రదాడికి ప్రతిగా కేంద్రం చేపట్టిన ఆపరేషన్‌ సిందూర్‌ విజయవంతం కావాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో ఐదోవార్డు గాంధీ నగర్లో తిరంగా ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ భారత సైన్యం అసమాన ధైర్య సాహసాలను ప్రదర్శిస్తూ దేశాన్ని రక్షిస్తోందన్నారు. సైన్యానికి తగిన శక్తిని ప్రసాదించాలని కోరుతూ నల్ల పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐదోవార్డు బీజేపీ అధ్యక్షులు సంతోష్‌, మాజీ అధ్యక్షులు విజయ్‌ యాదవ్‌ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు

గాయాలపాలవుతున్న వాహనదారులు

బంజారాహిల్స్‌: పంజగుట్ట ప్రధాన రహదారిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా ఉన్నాయి. వరద నీటి కాల్వల కోసం నిర్మించిన మ్యాన్‌హోళ్ల మూతలు దెబ్బతిని కనిపిస్తున్నాయి. రాత్రి వేళల్లో పలువురు ద్విచక్ర వాహనదారులు వీటిని గుర్తించకుండా వీటిపై నుంచి వెళ్తూ కిందపడి గాయాలపాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇంజినీరింగ్‌ శాఖ అధికారులు వీటిని పట్టించుకోకపోవడంతో ఇవి రోజురోజుకు మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. ఈ రోడ్డులో పదికిపైగా మ్యాన్‌హోళ్లు దెబ్బతిన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు.



పంజగుట్ట ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా వరద నీటి కాల్వ మ్యాన్‌హోళ్లు

వరల్డ్‌ మాస్టర్స్‌ గేమ్స్‌ నగర క్రీడాకారుల ఎంపిక



అవిక్‌ నియోగీ



సుభామిత్ర చటర్జీ

ఉస్మానియా యూనివర్సిటీ: తైవాన్‌లో జరిగే వరల్డ్‌ మాస్టర్స్‌ గేమ్స్‌-2025కు నగరానికి చెందిన అథ్లెటిక్స్‌ కోచింగ్‌ అకాడమి క్రీడాకారులు అవిక్‌ నియోగీ, సుభామిత్ర చటర్జీ ఇండియా తరపున ఎంపికైనట్లు ఓయూ ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ డైరెక్టర్‌ ప్రొ.రాజేష్‌కుమార్‌ సోమవారం తెలిపారు. ఈ నెల 17 నుంచి 30 వరకు తైవాన్‌లోని తైపీ అండ్‌ న్యూ తైపీ సిటీలో పోటీలు జరగనున్నట్లు పేర్కొన్నారు. అవినిక్‌ నియోగీ, సుభామిత్ర చటర్జీ 2023లో జరిగిన నేషనల మాస్టర్స్‌ గేమ్స్‌లో వివిధ విభా గాలలో బంగారు పతకాలు సాధించినట్లు చెప్పారు.

'సామూహిక సీమంతాలను ఘనంగా నిర్వహిస్తాం'




అమీర్‌పేట: వచ్చే సంవత్సరం నియోజకవర్గ వ్యాప్తంగా సామూహిక సీమంతాలను ఘనంగా నిర్వహిస్తామని సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ తెలిపారు. సోమవారం అమీర్‌పేట ధరం కరం రోడ్డులోని అతిథి ఇన్‌ హోటల్‌లో నిర్వహించిన సామూహిక సీమంతాలు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 120 మంది గర్భిణీస్త్రీలను ఆశీర్వదించారు. వచ్చే సంవత్సరం మహిళా దినోత్సవం రోజు 500 మందికి సామూహిక సీమంతాలు చేస్తామన్నారు. బేగం పేట కార్పొరేటర్‌ మహేశ్వరీ, మాజీ కార్పొరేటర్‌ శేషుకుమారి పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ జయంతి



బన్సీలాల్‌పేట్‌: బన్సీలాల్‌పేట్‌ డివిజన్‌ హమాల్‌ బస్తీలో సోమవారం బుద్ధ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుద్ధుని విగ్రహానికి పూలమాలలు వేసిన బస్తీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. బస్తీ నాయకులు శివప్ప, సుభాష్‌, యాదగిరి, కుషాల్‌, దేవేందర్‌, సత్యనారాయణ, ధర్మ, రవి, రాజు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలపై ఒరిగిన విద్యుత్‌ స్తంభం



లాలాపేట: తార్నాక డివిజన్‌ లాలాపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రం ముందు విద్యుత్‌ స్తంభం రెండు రోజుల క్రితం ఒక వైపు ఒరిగి చెట్ల కొమ్మలపై ఆనుకుంది. గట్టిగా గాలి వీస్తే అది కిందపడి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. ఈ విషయమై సంబంధిత విద్యుత్‌ అధికారులు సమాచారం ఇచ్చినా ఇంతరకు స్పందించడం లేదని స్థానికులు పేర్కొన్నారు.

'గాంధీ'లో ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



నైటింగేల్‌ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గాంధీ సూపరింటెండెంట్‌ రాజకుమారి, నర్సింగ్‌ ఆఫీసర్లు

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్‌ గాంధీఆస్పత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకలు సోమవారం సందడిగా నిర్వహించారు. ఫ్లోరెన్స్‌ నైటింగేల్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆస్పత్రి ప్రాంగణంలో రంగవల్లులతో తీర్చిదిద్దిన నైటింగేల్‌ ఆకృతి ఆహుతులను ఆకట్టుకుంది. ముఖ్యఅతిథిగా హాజరైన గాంధీ సూపరింటెండెంట్‌ సీహెచ్‌ఎస్‌ రాజకుమారి మాట్లాడుతూ.. నర్సులు అందించే సేవలు వెలకట్టలేనివని, నర్సింగ్‌ వృత్తి సేవకు మారుపేరుగా నిలుస్తుందన్నారు. ఫ్లోరెన్స్‌ నైటింగేల్‌ ఆశలు, ఆశయసాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గాంధీ గ్యాస్ట్రోఎంట్రాలజీ హెచ్‌ఓడీ శ్రవణ్‌కుమార్‌, ఆర్‌ఎంఓ-1 శేషాద్రి, నర్సింగ్‌ సూపరింటెండెంట్లు స్టెల్లామేరీ, విద్యావతి, నర్సింగ్‌ ఆఫీసర్లు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ



భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్‌, బోర్డు సభ్యురాలు భానుక నర్మద

కంటోన్మెంట్‌: రాజకీయాలకు అతీతంగా కంటోన్మెంట్‌ అభివృద్ధికి పాటుపడుదామని ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ పిలుపునిచ్చారు. కంటోన్మెంట్‌ నాలుగో వార్డు లక్ష్మీ నగర్‌ లో రూ.27 లక్షల నిధులతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు కంటోన్మెంట్‌ బోర్డు నామినేటెడ్‌ సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్‌తో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కంటోన్మెంట్‌ బోర్డుకు పన్నుల రూపంలో వచ్చే నిధులకు తోడుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు తెప్పించి అభివృద్ధి చేస్తామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తాను ఎమ్మెల్యేగా గెలిచాక, తొలిసారిగా కంటోన్మెంట్‌కు రూ.10 కోట్ల ప్రత్యేక నిధులు తెప్పించానన్నారు.

ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదు

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రజాస్వామ్యంలో హింసాకు తావులేదని ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర నాయకులు డాక్టర్‌.మాసాడి బాబురావు అన్నారు. సోమవారం ఓయూ ఆర్ట్స్‌ కాలేజీ న్యూసెమినర్‌ హాలులో ఏబీవీపీ ఆధ్వర్యంలో మానవత్వమా...? మావోయిస్టు మరణకాండనా...? అనే అంశంపై రౌండ్‌టేబుల్‌ సమావేశం జరిగింది. రాష్ట్రంలోని వివిధ వర్సిటీలకు ఏబీవీపీ నాయకులు హాజరు కాగా ఓయూ అధ్యక్షులు దృహన్‌ అధ్యక్షత వహించారు. డా.మాసాడి బాబురావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగానికి విరుద్ధంగా ఆయుధాలు చేపట్టి చట్టాన్ని తమ చేతిలోకి తీసుకొని అమాయకులను చంపుతున్న నక్సలైట్ల ఏరివేతకు కొనసాగుతున్న ఆపరేషన్‌ కగార్‌ను ఆపాలని సీఎం రేవంత్‌ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌ పేర్కొనడం శోచనీయమన్నారు. ఆపరేషన్‌ కగార్‌ వ్యతిరేకులను ఘటుగా విమర్శించారు. కార్యక్రమంలో డా.రామకృష్ణ, జీవన్‌, ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షులు జానారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డా.మాసాడి బాబురావు

గాంధీలో వాటర్‌ ప్యూరిఫై సెంటర్లు ప్రారంభం



వాటర్‌ ప్యూరిఫై సెంటర్‌ను ప్రారంభిస్తున్న గాంధీ సూపరింటెండెంట్‌ రాజకుమారి

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్‌ గాంధీఆస్పత్రిలో దివీస్‌ ల్యాబోరేటరీస్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్‌ ప్యూరిఫై సెంటర్లను గాంధీ సూపరింటెండెంట్‌ ప్రొఫెసర్‌ రాజకుమారి సోమవారం ప్రారంభించారు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, రోగి సహాయకులు, సందర్శకుల కోసం కార్పొరేట్‌ సోషల్‌ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్‌) ద్వారా రూ. 72.36 లక్షల వ్యయంతో గాంధీ ఆస్పత్రిలోని వివిధ ప్రాంతాల్లో 24 వాటర్‌ ప్యూరిఫై సెంటర్లను ఏర్పాటు చేసినట్లు దివీస్‌ ల్యాబ్‌ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ-1 శేషాద్రి, రెసిడెంట్‌ మెడికల్‌ ఆఫీసర్లు, వైద్యసిబ్బంది, దివీస్‌ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మైక్రో బయోలజీ విభాగం సిల్వర్‌ జూబ్లీ వేడుకలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌ సైన్స్‌ కాలేజీలోని మైక్రో బయోలజీ విభాగాన్ని స్థాపించి 50 సంవత్సరాలు సందర్భంగా అక్టోబరులో సిల్వర్‌ జూబ్లీ ఉత్సవాలను నిర్వహించనున్నారు. సోమవారం వీసీ ప్రొ.కుమార్‌ అధికారులు, ఇతర అధ్యాపకులు ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఎమర్జింగ్‌ మైక్రోబియల్‌ టెక్నాలజీస్‌ ఫర్‌ వన్‌ హెల్త్‌ అనే అంశం పై అక్టోబరు 15,16,17 తేదీలలో ఓయూలో అంతర్జాతీ సదస్సును నిర్వహించనున్నట్లు విభాగం హెడ్‌, సదస్సు కన్వీనర్‌ ప్రొ. భీమా తెలిపారు. సదస్సుకు 20 దేశాల నుంచి వక్తలు, ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రొ.కుమార్‌

ఘనంగా అన్నమయ్య జయంతి

నల్లకుంట: నల్లకుంట శివం సిండికేట్‌ బ్యాంక్‌ చౌరస్తా సమీపంలోని శ్రీ సరస్వతి సంగీత విద్యాలయంలో సోమవారం సాయంత్రం తాళ్లపాక అన్నమాచార్య జయంతిని నిర్వహించారు. దీనికి హాజరైన హైకోర్టు న్యాయవాది వీవీఎల్‌ఎన్‌ శర్మ, సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్‌ పంచశత వీణాగాన రత్న పోపూరి శ్రీనివాసశర్మతో కలిసి అక్కడ ఏర్పాటు చేసిన అన్నమయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. భక్తి కవిత్వాన్ని, సమాజాభ్యుదయాన్ని సమన్వయ పరిచిన సంకీర్తనాచార్యుడు అన్నమయ్య అని కొనియాడారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

రాంగోపాల్‌పేట్‌: అగ్ని ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. మహంకాళి, మార్కెట్‌, రాంగోపాల్‌పేట్‌ పోలీసుల ఆధ్వర్యంలో ఏసీపీ సైదయ్య, ఇన్‌స్పెక్టర్లు పరశురాం, రాంచందర్‌ రాంగోపాల్‌పేట్‌ డీఐ విక్రం సింగ్‌, ఫైర్‌ విభాగం అధికారి శంకర్‌ల ఆధ్వర్యంలో ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం హాలు వెలుపల అవగాహన కల్పించారు. ముఖ్యంగా గ్యాస్‌ సిలిండర్‌ నుంచి గ్యాస్‌ లీకై మంటలు అంటుకున్నపుడు భయపడాల్సిన అవసరం లేదన్నారు. గన్నీ బ్యాగులను నీళ్లలో ముంచి మండుతున్న సిలిండర్‌పై కప్పి ఆక్సిజన్‌ అందకుండా చేస్తే మంటలు ఆగిపోతాయని తెలిపారు.



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు, ఫైర్‌ అధికారులు